# పంజరంలో చిలక

'అత్తగారూ, అక్కడ నుంచోకూడదు..'

'అలాగా!'

'అత్తగారూ, అక్కడ కూర్చోకూడదు.'

'నాకు తెలీదమ్మా.'

'ఇది మన వూరు కాదు. ఇక్కడి పద్ధతులు వేరు. ఇక్కడున్నప్పుడు మనం కూడా వాళ్ల పద్ధతుల ప్రకారం మెలగడం మంచిది. లేకపోతే మనం నవ్వుల పాలవుతాం...' ఆఫీసుకి వెడుతూ, అత్తగారు ఎలా మసులుకోవాలో చెప్పిందే చెప్పింది కోడలు. సుమారు లక్షరూపాయలిచ్చి తన కొడుకుని కొనుక్కున్న కోడలు, మధ్యమధ్య వాచీ చూసుకుంది. లేకపోతే యీ చెయ్యవలసిన - చెయ్యకూడని పనుల పాఠం మరికొంతసేపు సాగివుండేది. వెడుతూ వెడుతూ, 'నేను చెప్పినవన్నీ గుర్తుంచుకోండి... రెండింటికల్లా స్కూల్ బస్సు వస్తుంది. ఆ సమయానికి మీరక్కడ వుండక పోతే, అబ్బాయి గాభరాపడతాడు. ఆ గాభరాకి తర్వాత వాడికి జ్వరం వచ్చినా రావచ్చు. అదీకాక ఆ కండక్టర్ వెధవ మహా పొగరుబోతు... అబ్బాయిని దింపకుండానే మళ్ళీ స్కూలుకి తీసుకు వెళ్ళినా వెడతాడు. ఆ తర్వాత మనం చాలా యిబ్బంది పడవలసివస్తుంది. అందుకే చిలక్కి చెప్పినట్టు చెప్పడం...' అని మళ్లీ మరోసారి బీరుపోకుండా పాఠమంతా వల్లెవేసింది. '...అరెరె, మీతో మాట్లాడుతూవుంటే ఐదు నిముషాలు ఆలస్యమయింది నాకు. ఆ బస్సు పోతే, అరగంట దాకా బస్సు రాదు... పాడు ఉద్యోగం ... సుఖంలేదు..' అంటూ జారిపోతున్న పమిటను కూడా సరి చేసుకో కుండా దూసుకుపోయింది కోడలు, తుపాకి గుండులా. ఎంత అధికార స్వరం!

నివ్వెరపోతూ అత్తగారు కూలబడింది. ఆ సోఫాలో – నవ్వితే సొట్టలు పడే దవడలులా... నడుము తాకగానే లోతుకు పోయే సోఫాలో.

అత్తగారూ ఒకయింటి కోడలే! అయినా అత్తగారి ఆరళ్లు లోక ప్రసిద్ధం. కానీ తన విషయంలో అంతా అస్తవ్యస్తమై పోయిందనుకుంది ఆవిడ. బాధకు లోనయింది. కలికాలం కాకపోతే ఏమిటి యీ ఆరళ్లు – కోడలి ఆరళ్లు!

పెద్ద చిన్నా లేకుండా ఏమిటో యీ ఆజ్ఞలనుకుని తన దురదృష్టాన్ని స్ఫురణకు తెచ్చుకుంది. మోగుతున్న టీ.వి. నోరు నొక్కింది. ఇల్లంతా నిశ్శబ్దం. అలా కూర్చుని గత విషయాలు నెమరు వేసుకుంటున్న ఆవిడకి గోడగడియారం గంటలు కొట్టిన చప్పుడు కూడా వినిపించలేదు. వీధి తలుపు గొళ్ళెం చప్పుడు వినిపించేసరికి తలుపు వెయ్యలేదన్న సంగతి తెలుసుకుని ఆదుర్దాగా బయటికి వచ్చింది.

'ఏమిటి బామ్మగారూ, తలుపు కూడా వేసుకోకుండా లోపల ఏం చేస్తున్నారు?' పక్క ఫ్లాటుకి వచ్చి పదిరోజులైన రిటైర్డు ఆర్మీ ఆఫీసరుగారి మనమరాలు అడిగింది. అదృష్టవశాత్తు వాళ్లు తెలుగువాళ్లు కావడంవల్ల ఆవిడకి కొంచెం కాలక్షేపమవుతోంది. ముక్కూ మొగం తెలియని వాళ్ల మధ్య యింకా అవస్థపడివుండేది!

'కూరలూ అవీ అమ్ముకునేవాళ్లు తలుపు తెరిచి వుంటే యింట్లోకి జొరబడతారని మా తాతయ్య మాటిమాటికి చెపుతూ వుంటాడు...' అంటూ ఆ అమ్మాయి లోపలికి వచ్చి ఆవిడ పక్కనే కూర్చుంది.

'ఏదో ఆలోచిస్తూ అలా కూర్చుండిపోయాను.'

ఉన్నట్టుండి ఆవిడ దృష్టి గడియారం వైపు పడింది.

'నా ఆలోచన మండిపోను! రెండు కావస్తోంది. స్కూల్ బస్సు వచ్చేవేళయింది...' అంటూ ఆ బస్సు ఆగే చోటికి ఆవిడ బయలు దేరింది. ఆ అమ్మాయి కూడా లేచి వెలుపలికి వచ్చింది.

'బామ్మగారూ, మీరు రాకముందు మీ మనవణ్ణి ఎవరు తీసుకు వచ్చేవాళ్లు?'

'మా కోడలు వచ్చేంతవరకు వాడు వాళ్ల స్నేహితుల యిళ్లలో కూర్చునేవాడట...'

'సాయంకాలం దాకానా?'

'ఏం చేస్తాడు?'

'మరి మధ్యాహ్నం పూట అన్నం తినడా?'

'టిఫిన్ బాక్సులో వున్న అన్నమే తినేవాడు కాబోలు...'

'పాపం' నిట్టూర్చింది ఆ అమ్మాయి.

ఆవిడకి మనవడి పట్ల జాలి వేసింది.

బస్సు ఆగే చోటికి ఆవిడ గబగబ నడిచి వెళ్లింది. అయిదారు నిముషాలలో మనవణ్ణి వెంటపెట్టుకుని ఆవిడ తిరిగి వచ్చింది. అంతవరకు ఆ అమ్మాయి యిల్లు కనిపెట్టుకుని అక్కడే నుంచుంది.

'ప్రతి విషయానికి వీళ్లిక్కడ ఏదో అంటారు చూడమ్మా...'

'ధన్యవాద్...సుక్రియా....'

'అదే.. అదే...' అంది నవ్వుతూ.

మనవడిరాకతో నిద్రపోయిన యిల్లు మేలుకుంది. అంతవరకూ అద్దంలా వున్న యిల్లు మసక మసకగా కనిపించసాగింది. ఆటసామాన్లు, బొమ్మలు ప్రాణం పోసుకోసాగాయి.

'అన్నం తిని నీ యిష్టం వచ్చినంత సేపు ఆడుకో నాయనా...బంగారు బాబువి కదూ...' బుజ్జగించింది బామ్మ.

సెంకడ్ స్టాండర్డులోకి వచ్చిన మనవడు బ్యాటరీ అమర్చిన కమాండో మెలమెల్లగా పాకుతుంటే చూసి ఆనందిస్తూ అన్నాడు.'ఇవ్వాళ మాక్లాసులో ఒక అబ్బాయి పుట్టిన రోజు. చాక్లెట్లు అవీ యిచ్చాడు... ఐస్ క్రీం కూడా తిన్నాను. ఆకలి వెయ్యడంలేదు...'

కమాండో పాకుతుంటే నిజంగా తుపాకి పుచ్చుకున్న ఒక మనిషి నేలమీద పాకుతున్నట్టే వుంది. ఆ వినోదంలో పాలు పంచుకుంది ఆ అమ్మాయి కూడా.

'బామ్మగారూ, మీరెప్పుడైనా చూశారా యీ కమాండోని...' అడిగింది.

'నా మొహం నేనెక్కడ చూశానమ్మా యిలాంటి బొమ్మల్ని... మారోజుల్లో లక్కపిడతలే... పైగా మావాళ్లు యిలాంటి చక్కటి బొమ్మలు కొని యిచ్చేవాళ్లా? నోరు విప్పి ఏమన్నా అడిగితే చాలు మండిపడేవాళ్లు...'

'ఎంతకు కొన్నారు యీ బొమ్మ?'

'పల్లెటూళ్లో పుట్టి పెరిగాను... నాకేం తెలుస్తాయమ్మా... యీ పట్టణం బొమ్మల ధరలు. ...పది రూపాయలుంటుందా...' ఆ అమ్మాయి నవ్వాపుకోలేక పోయింది. 'మూడొందలు...'

'ఏమిటి! మూడొందలా?' బామ్మగారి ఆశ్చర్యానికిమేరలేదు. 'ఇంత ధరే...' కమాండో వంక కన్నార్పకుండా చూడసాగింది. నా చిన్నతనంలో యిలాంటి బొమ్మలతో ఆడుకోలేక పోయానే అనుకుంది. మనవడి అదృష్టాన్ని చూసి లోలోన మురిసిపోయింది. అంతలోనే తన బాల్యస్మృతులు గుర్తుకు వచ్చి బాధపడింది. ఆ బాధలో అసూయ తొంగి చూసింది. ఛీ – నా పాడు బుద్ధి మండిపోను ... తన్ను తాను నిందించుకుంది.

'ఏమిటి బామ్మగారూ, మీలో మీరే మాట్లాడుకుంటున్నారు...' అడిగింది ఆ అమ్మాయి.

'ఏమీ లేదమ్మా ... మా మనవడు అదృష్టవంతుడమ్మా...'

'నిజంగానే అదృష్టవంతుడు!'

'నువ్వూ అలాగే అనుకుంటున్నావా?'

'అవునండీ, ఈ ఊళ్లో కూడా అందరు పిల్లలు యిలాంటి ఖరీదైన బొమ్మలతో ఆడుకోలేరు. ఆడుకుందామనుకున్నా, తల్లిదండ్రులు కొనిపెట్టలేరు...'

'నేను చెప్పకూడదు కాని, మా అబ్బాయికి చిన్నప్పటినుంచీ బొమ్మలంటే మహా సరదా!'

'కంపెనీ నుండి రాగానే కొంచెంసేపైనా అంకుల్ వాళ్లబ్బాయితోపాటు బొమ్మలతో ఆడుకుంటారు...'

పిల్లాడు పుట్టినా వాడికింకా బొమ్మల పిచ్చి పోలేదన్నమాట!' అవ్యక్త మైన సంతోషం ఆవిడ ముఖంలో ప్రస్ఫుటమయింది.

'ఆంటీ విసుక్కుంటారు.'

'అలాగా!' కోడల్ని గురించి ఏదో చెప్పాలనుకుంది ఆవిడ. ఇవ్వాళ్ల వుండి రేపు వెళ్లిపోయేదాన్ని నేను... కోడలు వాళ్లు యిక్కడ వుండేవాళ్లు... రేపు ఆ అమ్మాయి తనను గురించి విరుద్ధంగా మాట్లాడుతుందేమో! బామ్మగారు మౌనం వహించింది.

పక్కఫ్లాటులోంచి 'అల్కా... అల్కా...' వినిపించింది. 'మా తాతయ్య పిలుస్తున్నాడు' అంటూ లేచింది ఆ అమ్మాయి.

'నీ పేరు అలమేలన్నావ్...'

'ఆ పేరు తాతయ్యకు నచ్చక, అల్కా అని పిలుస్తాడు.'

'బాగుంది... ఇక్కడి వాళ్ల పేర్లువింటున్న కొద్దీ పుల్లమ్మ, ఎల్లమ్మ పేర్లు నాకే అదోలా కనిపిస్తున్నాయి.'

'మీరు పాతకాలపు బామ్మగారు కాదండీ...' అంటూ ఆ అమ్మాయి 'వెళ్లొస్తానండీ' అని సెలవు తీసుకుని వెళ్లిపోయింది.

మనవడికి ఆకలయింది కాబోలు, అడిగి పెరుగన్నం తిన్నాడు. ఆవిడ బ్రహ్మానందం చెందింది.

సాయంకాలమవుతోంది. బామ్మగారిని భయం ఆవహించింది. మళ్లీ కోడలి పాఠాలు ప్రారంభమవుతాయి కాబోలు!

తన కొడుక్కి బొమ్మలంటే ఎంత యిష్టమో, ఒర్రగా వుండే కంది పచ్చడి అంటేను అంత యిష్టం. తన చేత్తో చేసి పెట్టాలనుకుంది. పచ్చడితోపాటు పచ్చిపులుసుకూడా చేసింది.

పొద్దున కాలం మెల్లమెల్లగా నడిచింది. కానీ సాయంకాలం మాత్రం లేడి పరుగులా సాగింది. ఆరోజు కోడలు ఆఫీసు నుండి కొంచెం త్వరగా వచ్చింది. ఇల్లు ప్రశాంతంగానే వుంది. ఆ రాత్రి భోజనాల దగ్గర పాతకబుర్లు వంతులవారీగా పరుగులు తీయసాగాయి.

'కందిపచ్చడి తిని ఎంతకాలమయిందో...' అంటూ మళ్లీ పచ్చడి కలుపుకున్నాడు కొడుకు.

'నేను చేస్తే మీరు కారంకార మంటున్నారని పచ్చడి చెయ్యడం మానుకున్నాను' అంది కోడలు, అభిమానం దెబ్బతిన్నప్పటికీ.

'ఏమైనా కందిపచ్చడి మా అమ్మ చెయ్యాలి, తినాలి. దాని ముందు మిగిలిన వన్నీ బలాదూరు...' చాలా మెచ్చుకున్నాడు.

అందుకు కోడలు ఆగ్రహం చెందుతుందేమోనని భయపడిన బామ్మగారు కోడలి ప్రత్యుత్తరం విని ఆశ్చర్యపోయింది. 'మీరు చెప్పింది నిజమే. అత్తగారు చేసిన పచ్చడి చాలా బాగుంది.'

మబ్బులు లేనివానలా, ఉన్నట్టుండి కొడుకు ఒకటి అడిగాడు.

'నువ్వు రాకరాక నా దగ్గరికి వచ్చావు. వచ్చి నెల కూడా కాలేదు. అప్పుడే ఎందుకు వెడతానంటున్నావ్?'

అత్తగారి బదులుకోసం కోడలు చాతక పక్షిగా మారింది. కానీ ఆవిడ నవ్వి ఊరుకుంది. ఆ నవ్వులోని అంతర్యం తెలీక మళ్లీ కొడుకు అడిగాడు. ఈసారి సూటిగానే ప్రశ్నించాడు.

'ఈ ఊరు నీకు నచ్చలేదా...'

'నచ్చకపోవడమేమిట్రా... బయట తెల్లని ఎండవేసినా, యింట్లో చల్లగా వుంటోంది... కూలర్ వల్ల రాత్రిళ్లు చలివేస్తోందనుకో. ఎండాకాలంలో కప్పుకోవడమేమిటా అని నేనే ఆశ్చర్యపోతున్నాను. ఇక్కడ నాకు ఒంటికి తగ్గ పనిలేదు. ఇల్లు ఎప్పుడూ కోమటిల్లులా వుంటుంది. ఏ వస్తువుకీ కొరత లేదు. మనవడితోపాటు నేనూ అప్పుడప్పుడు బొమ్మలతో ఆడుకుంటున్నాను'

'ఇంకా నయం... వాడిలా నేనూ ఆటల ధ్యాసలోనే వున్నాననలేదు...' అంటూ కోడలు మందహాసం చేసింది.

'నువ్వు చెప్పింది నిజమేనమ్మా... బ్యాటరీ అమర్చిన ఆ కమాండో... ఆ రైలింజను... అవి చేసే ధ్వనులు ... అవన్నీ నన్ను పసిపిల్లగా మార్చాయంటే నమ్ము. ఆశ్చర్యం గొలుపుతున్న అలాంటి బొమ్మల్ని నా జన్మలో చూడలేదు...' అమాయకంగా చెప్పింది బామ్మగారు.

'అయితే అ బొమ్మలు నీకు బాగా నచ్చాయన్నమాట! పట్టణానికి వెళ్లినప్పు డల్లా, కీ యిస్తే కదిలే బొమ్మలు తెచ్చేదానివి నువ్వు... అమ్మా,

నీకు గుర్తుందా?' కొడుకు మాటల్లో ఎంత ప్రేమ! ఆవిడ మనస్సు ఆర్ద్రమయింది.

'ఆ పిచ్చి బొమ్మలు నీకింకా గుర్తున్నాయట్రా?'

'ఆ రోజుల్లో అవే గొప్ప బొమ్మలు! ఎందుకో తెలీదుగాని, అప్పటి నుంచీ నాకు బొమ్మల పిచ్చి... వీడికీ యింతే...'

'మంచి బుద్ధులు రావుగాని, యీ బుద్ధులు మాత్రం వాటంతట అవేవస్తాయి.' అంది కోడలు, చిలిపిగా నవ్వుతూ.

'మా తండ్రీకొడుకులవి మంచిబుద్ధులు కావంటావా... అదేగా నీ అభిప్రాయం?'

'నవ్వులాటకన్నాను గాని... మీరు మంచివారు కాదని ఎవరన్నారిప్పుడు?'

వాళ్ల సంభాషణ వింటూ ఆవిడ నవ్వుకుంది.

'దాని మాటలకేంగాని... అమ్మా! నేనడిగిన దానికి నువ్వు బదులు చెప్పలేదు..' మళ్లీ కొడుకు అడిగాడు, తల్లివంక చూస్తూ.

'రేపు చెపుతాను...తొందరేముంది...' అని తప్పించుకుంది ఆవిడ.

భోజనాలు ముగిసిన తర్వాత, కొంతసేపు టీ.వి. చూశారు. మనవడు టీ.వి,. చూస్తూనే నిద్రపోయాడు. కొడుకూ కోడలు కూడా తమ గది చేరుకున్నారు, కొత్తశక్తితో రేపటి జీవిత సమరంలో పాల్గొనాలనే అభిలాషతో.

కొడుక్కి ఎలా ఏమని సమాధానం చెప్పాలా అని ఆలోచిస్తూ ఆవిడ మంచం మీద నడుమువాల్చింది. ఎప్పుడు నిద్రపట్టిందో యేమిటోగాని తెల్లవారు జామున, అలవాటు ప్రకారం మేలుకుంది.పిల్లవాడికి ఏదో చేసి క్యారియర్‌లో పెట్టి పంపించాలి కాబట్టి, కోడలు త్వరగానే లేచి వంటింటి పనిలో మునిగిపోయింది.

లేచినా, ఆవిడ రాత్రి వచ్చిన కలను నెమరు వేసుకొంటోంది... . తాను స్వగ్రామం చేరుకుందట. మామగారు కట్టించిన ఆ లంకంత ఇంట్లో - తానూ తన భర్త సౌఖ్యావహంగా కాలం గడిపిన ఆ ఇంట్లో - కాలు పెట్టగానే కొడుకు నగరంలో నివసిస్తున్న అద్దెకొంప వెలవెల బోతూ

కనిపించిందట. తన యిష్టం వచ్చినట్టు పనిపాటులు చేసుకుంటున్నప్పుడు కోడలి ఆరళ్ళు గుర్తుకు వచ్చాయట. వాయు దేవుడు ప్రత్యక్షంగా దర్శనమిచ్చే తన యింట్లో, కొడుకు యింట్లో ఫాను కదిలినప్పుడే ఒంటికి గాలి తగిలిన సంగతి స్ఫురణకు వచ్చిందట. తమ వూళ్లో పక్షులు బిలబిల మంటూ పైపైకి ఎగురుతూంటే కొడుకువద్ద వున్నప్పుడు తనకు కాలక్షేపంగా వున్న ఆ అమ్మాయి వాళ్ల ఫ్లాటులో పంజరంలోని రామ చిలక బిక్కు బిక్కుమంటూ కనిపించిందట...

ఆ రోజు ఆవిడ అంత ఉత్సాహంగా కనిపించలేదు. బద్ధకంగా కాలకృత్యాలు తీర్చుకుని కోడలిచ్చిన హార్లిక్సు తాగింది.

ఆఫీసుకి బయలుదేరిన కొడుకు, 'ఏమిటమ్మా, ఒంట్లో బాగాలేదా?' అడిగాడు.

ఆవిడ చెప్పిన బదులు బయటినుండి వినిపించిన టెలిగ్రాం అన్న కేకలో కలిసిపోయి వినిపించలేదు. అందరి చూపులూ టెలిగ్రాం చదువుతున్న ఆవిడ కొడుకు మీదే ఉన్నాయి. 'అక్కయ్యకిప్పుడు మూడోనెలట! నిన్ను వెంటనే రమ్మని బావ అర్జంట్ టెలిగ్రామిచ్చాడు... వివాహమయిన చాలా కాలానికి తన కుమార్తె కడుపు పండుతున్నందుకు ఆవిడ చాలా సంతోషించింది. సంతోషంతోపాటు రాత్రి వచ్చిన కల కూడా గుర్తుకి వచ్చింది. ఒక నగరం నుండి మరో నగరానికి... ఒక అద్దె కొంప నుండి మరో అద్దెకొంపకు... ఎంతవద్దనుకున్నా అనుకుంది.